

వామనావతారంలో స్వామివారు

గుణగణాలు కీర్తించి.. పరిణయానికి ఒప్పించి!

నేత్ర పర్వంగా ఎదుర్కోలు ఉత్సవం..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఎదుర్కోలు ఉత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని వెండి శేష వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి.. పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు, అర్చకులు రెండు వర్గాలుగా ఏర్పడి.. ఒకరు స్వామివారి, మరొకరు అమ్మవార్ల గుణగణాలు కొనియాడి.. పెళ్లికి ఒప్పించిన తీరు భక్తులకు కనువిందైంది. ప్రత్యేక అలంకారాల్లో భాగంగా స్వామివారు వామనావతారంలో దర్శనమిచ్చారు. హనుమద్వాహనాన్ని అధిరోహించి ద్వారకాతిరుమల పురవీధుల్లో శ్రీరాముని అలంకారంలో విహరించారు. ● బుధవారం రాత్రి స్వామి వారు వెండి శేష వాహనంపై విహరించారు. ● కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం. రాత్రి 8 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం. వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.



ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న పండితులు

రాయితీపై వంట నూనె




ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని 32 కేంద్రాల్లో రాయితీపై పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె విక్రయిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాల సంస్థ అధికారులు, సిబ్బంది, చౌక ధరల దుకాణ డీలర్లు, వర్తక సంఘాల ప్రతినిధులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. సూపర్ బజార్లలో బియ్యం, కందిపప్పు రాయితీపై విక్రయించాలన్నారు.


18 నుంచి రీసర్వేపై గ్రామసభలు.. ఈ నెల 18 నుంచి భూముల రీ సర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులతో సమావేశమై మాట్లాడారు. రేషన్ దుకాణాలకు ఎమ్మెల్సీ పాయింట్ల నుంచి నాణ్యమైన నిత్యావసర సరకులు పంపిణీ చేసేలా అధికారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. రేషన్ ఎమ్మెల్సీ పాయింట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెట్రోలు బంకులు, వంటగ్యాస్ గోదాములు, గోనె సంచుల పంపిణీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

లెక్కల గారడీ.. ఆపై బురిడీ..

డీ అండ్ వో ట్రేడ్ లైసెన్సు దుకాణాల్లో అక్రమాలు



ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో దుకాణాలకు డీ అండ్ వో ట్రేడ్ లైసెన్సుల జారీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మొత్తం నగరంలో 6,660 దుకాణాలుండగా వాటిలో కొన్ని మూతపడ్డాయి. మరి కొన్ని మూతపడిన జాబితాలో చేర్చి చెల్లించే ఫీజులో వెసులుబాటు కల్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అనుమతులు రెన్యువల్ చేసే విషయంలోనూ అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అనధికారికంగా కొన్ని దుకాణాలకు అనుమతులిచ్చారు.





నిబంధనలకు తూట్లు.. దుకాణం ఉన్న సెంటర్, అక్కడ వ్యాపార సామర్థ్యం సౌకర్యాలను బట్టి లైసెన్సు ఫీజు ఉంటుంది. ఇక్కడే మతలబు చేస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణం ఉన్నా తక్కువ ఉన్నట్లు లెక్కలు చూపటం, అంత డిమాండ్ లేని ప్రాంతమని రాసుకోవటం చేస్తూ.. దుకాణం యజమానికి లబ్ధి చేకూరేలా చేస్తున్నారు. తద్వారా నగర పాలక సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏటా దుకాణాలు పెరిగినా ఆదాయం పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం.

● వన్‌టౌన్ లోని మెయిన్ బజారులో దుకాణాల సముదాయం ఉంది. అక్కడ సిబ్బంది కనీస నియమాలు పాటించకుండా అనుమతులు జారీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

“ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదు. బకాయిలను త్వరితగతిన వసూళ్లు చేసి మూతపడిన దుకాణాలను జాబితా నుంచి తొలగిస్తాం.” అని నగర పాలక సంస్థ కమిషనర్ భానూప్రతాప్ అన్నారు.

● చింతలపూడి మండలం ఫాతిమాపురం దుకాణం పరిధిలో మొత్తం 919 రేషన్ కార్డుదారులున్నారు. వీరిలో 300 మందికి మాత్రమే కిలో కందిపప్పు రూ.67కి సరఫరా చేశారు. ఈ మండలంలో మూడు పంచాయతీల పరిధిలోని దుకాణాలకు మాత్రమే 50 శాతం మేర ఇప్పటి వరకు సరఫరా చేశారు.

కందిపప్పు ఎప్పుడొస్తుందో!

కార్డుదారుల ఎదురుచూపు



చింతలపూడి, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్ దుకాణాలకు కందిపప్పు సరఫరా అంతంత మాత్రంగానే జరగడంతో కార్డుదారులు బయట మార్కెట్‌లో కేజీ రూ.160కి కొనలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెలలో సగం రోజులు గడిచిపోయినా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఇంకా రేషన్ దుకాణాలకు సరకు చేరలేదు.

జిల్లా బఫర్ పాయింట్ల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు కందిపప్పు సరఫరా జరగలేదని రేషన్ డీలర్లు చెబుతున్నారు.

240 టన్నులు మాత్రమే.. జిల్లాలో 6.42 లక్షల కార్డులు ఉంటే 240 టన్నుల కందిపప్పు మాత్రమే జిల్లా పౌర సరఫరాల సంస్థకు చేరింది. ఒక్కో కార్డుకు కేజీ చొప్పున ఇవ్వాల్సి ఉంది. 240 టన్నులు ఏం చేయాలో తెలియక అధికారులు తలలుపట్టుకుంటున్నారు. పూర్తి స్థాయిలో సరకు వచ్చిన వెంటనే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు చేరవేస్తాము’ అని డీఎస్వో సత్యనారాయణరాజు తెలిపారు.

వరి చేలపై ముప్పేట దాడి..!
సకాలంలో నష్టపరిహారం
8లో

పరిశ్రమించు.. ప్రోత్సాహమిదిగో!

అతివలకు ఆర్థిక భరోసా

చింతలపూడి, జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక సాధికారిత సాధించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటుకు ఆసక్తి చూపే వారిని ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించింది. సీడ్ క్యాపిటల్ ఫుడ్ ప్రాసెసింగ్, హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజస్ పథకాల ద్వారా డ్వాక్రా సభ్యులు స్థాపించే పరిశ్రమలకు భారీగా రుణం అందజేసి, అందులో 35 శాతం మేర రాయితీ ఇవ్వాలని సూచించింది.

సాంకేతిక శిక్షణ.. జిల్లాలో దోసె, ఇడ్లీపిండి, తీపి పదార్థాలు, కూరగాయలు, ధాన్యాలు, చపాతీలు, వేరుసెనగ, చిక్కీలు, బంగాళ దుంపల నుంచి చిప్స్, పాల పదార్థాల తయారీ, వాటి ఉప ఉత్పత్తులను నాణ్యత ప్రమాణాలతో తయారీ చేసే అనుబంధ పరిశ్రమలతో పాటు వ్యాపారం చేసేందుకు మక్కువ చూపే అతివలకు ముడి సరకు కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉత్పత్తి సామర్థ్యం, నిల్వపై సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నారు. మార్కెటింగ్‌పై అవగాహన కల్పించి ఆర్థికంగా భరోసా ఇవ్వనున్నారు.



మండలానికి అయిదు యూనిట్లు.. పీఎంఎఫ్ఎంఈ కార్యక్రమానికి స్వయం సహాయక సంఘాలను అనుసంధానం చేస్తే వారికి మరింత ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి గ్రామ సమాఖ్య పరిధిలో ఓ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం మండలానికి ఐదు చొప్పున నెలకొల్పేలా ప్రణాళిక రూపొందించింది.

రాయితీలు ఇలా.. జిల్లాలో గతేడాది సీడ్ కేపిటల్ ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా 369 మందికి రూ.1.35 కోట్లు రుణంగా ఇచ్చారు. ఈ ఏడాది మండలానికి 25 చొప్పున యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 258 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మొదటగా రూ.40వేలు రుణంగా ఇస్తారు. ఏడాది తర్వాత వ్యాపార విస్తరణకు హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌వోఈ) ద్వారా రూ.లక్ష నుంచి రూ.30లక్షల వరకు రుణం అందిస్తారు. గతేడాది 24 మంది డ్వాక్రా సభ్యులకు రూ.1.69 కోట్లు రుణంగా అందించారు. ఈ ఏడాది ఇప్పటికే 21 మంది హెచ్‌వోఈ పథకంలో దరఖాస్తు చేశారు. గ

అవగాహన కల్పిస్తున్నాం.. ‘డ్వాక్రా సంఘాల సభ్యులకు కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ పథకంలో భాగంగా 35 శాతం రాయితీతో కూడిన రుణం అందించేందుకు ముందుకొచ్చింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించేలా మహిళలను ప్రోత్సహిస్తాం. ’అని డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు తెలిపారు.

నచ్చిన మద్యం.. మెచ్చిన ధరలో..!

యుద్ధ ప్రాతిపదికన సరకు రవాణా

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మద్యం పాలసీ విధానంలో లాటరీ ప్రక్రియ ద్వారా దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు అమ్మకాలు ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో ఏడు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల పరిధిలో 144 మద్యం దుకాణాలు తెరవాల్సి ఉండగా సరకు సకాలంలో అందకపోవటం, దుకాణాలు ఏర్పాటు చేసుకోకపోవటంతో కొన్ని ప్రారంభం కాలేదు. ఏలూరు సర్కిల్ పరిధిలో 41కుగాను 21 దుకాణాలకే సరకు అందించారు. భీమడోలు పరిధిలో 22కు 19 దుకాణాలకు సరకు చేరింది. చింతలపూడిలో 16 దుకాణాలకు ఆరింటికి మాత్రమే సరకు అందించారు. వీటికి సరకు అందించేందుకు ఏలూరు ఐఎంఎల్ డిపోలో 87 వేల కేసుల లిక్కర్, 11 వేల కేసుల బీరు అందుబాటులో ఉంచారు. ఎంసీ విస్కీ, ఇంపీరియల్ బ్లూ, రాయల్ ఛాలెంజ్, కెఎఫ్ స్ట్రాంగ్ బీర్లు కొత్తగా అందుబాటులోకి రాగా మిగిలినవన్నీ పాత బ్రాండ్ లే ఉన్నట్లు అధికారులు తెలిపారు.



కైకలూరు: కోరుకొల్లు రోడ్డులో దుకాణం వద్ద మద్యం ప్రియుల బారులు

డిపో వద్ద హడావుడి.. మద్యం తీసుకువెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపారులు ఏలూరు ఐఎంఎల్ డిపో వద్ద క్యూ కట్టారు. తమకు ఏఏ సరకు ఎంతెంత కావాలో చలానా తీసి ఇండెంట్లు డిపో మేనేజర్‌కు అందించారు. మొదటి రోజు కావటం.. వ్యాపారాల్లో కొందరు కొత్తముఖాలు కావటంతో హడావుడి నెలకొంది.

☛ కొత్త దుకాణాలకు సరకు అందించే పనుల్లో ఉన్న ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పాత సరకును స్వాధీనం చేసుకునే విషయంలో అంత ఆసక్తి చూపడం లేదు.

“ఎంత రాత్రైనా జిల్లా వ్యాప్తంగా 144 దుకాణాలకు సరకు సరఫరా చేస్తాం. మంగళవారం రాత్రికి 80 శాతం సరకు సరఫరా చేశాం.” అని ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ శ్రీలత అన్నారు.

☛ సింగరాయపాలెంలోని బావాజీ మఠానికి చెందిన సర్వే నం.74-10లో 1.33 ఎకరాల భూమి ఇది. ఇది ప్రధాన రహదారి సమీపంలో ఉండటంతో ఆక్రమణకు గురైంది. దీనిలో బహుళ అంతస్తులు నిర్మించారు. ఆలయ అధికారులు 34 మంది ఆక్రమణదారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు ఈ ఏడాది మార్చిలో సర్వే చేసి అయిదుగురివి గ్రామ కంఠం భూములుగా, 29 మందివి ఆలయ భూమిగా నిర్ధారిస్తూ నివేదిక అందించారు. గత నెలలో ఆలయానికి అనుకూలంగా ట్రైబ్యునల్ తీర్పునిచ్చింది. నోటీసులు జారీ చేసి అవి ఖాళీ చేయించాలని పేర్కొంది. 2017 నుంచి ఆక్రమణదారు నుంచి నెలకు రూ.500 చొప్పున, తీర్పు వెలువడిన నాటి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేయాలని సూచించింది.



న్యాయస్థానం ఆదేశాలు బేఖాతరు

దేవుడి ఆస్తులకు కొరవడిన భద్రత

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దేవుడి ఆస్తులకు రక్షణ కరవైంది. యథేచ్ఛగా ఆలయ భూములు ఆక్రమించి, బహుళ అంతస్తులు, వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. సంబంధిత ఆలయ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ముదినేపల్లి మండలంలోని వడాలి జగన్నాథస్వామి, సింగరాయపాలెం బావాజీ మఠం, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలు భూములు అధికంగా ఉన్నాయి. బావాజీ మఠానికి సంబంధించి కేసులో భూములు ఆలయానివేనని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని ఆదేశాలు ఇచ్చి నెలరోజులు కావస్తున్నా కనీసం నోటీసులు సైతం అధికారులు ఇవ్వకపోవడం గమనార్హం.

★ తాజాగా ఓ దుకాణ సముదాయానికి సంబంధించిన కాలువ, మరో రెండు దుకాణాలు ఆలయ భూమిలో ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. “29 మందికి సంబంధించిన ఆర్డర్లలో ఇప్పటి వరకు 14 మాత్రమే అందాయి. త్వరలోనే మిగిలిన ఆర్డర్లు సైతం వస్తాయి. అవి రాగానే మొత్తం అందరికి నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం.” అని ఈవో యేసునాయులు అన్నారు.

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, మొగల్తూరు, న్యూస్‌టుడే



● బ్యాంకు లోను ద్వారా బస్సు కొనుగోలు చేసి, తణుకు డిపోలో నడుపుతున్నాను. ఆదాయం రాక పోగా రూ.45వేలు అదనంగా ఖర్చవుతోంది. రాయితీ సొమ్ము విడుదల కాకపోవడంతో బ్యాంకు సిబ్బంది సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని సతీశ్ వాపోయారు.

● తాడేపల్లిగూడెం డిపోలో రెండు బస్సులు తిప్పుతున్నా. రాయితీ రుణం రూ.30 లక్షలకు పైగా రావాలి. బ్యాంకుకు ప్రతి నెలా రూ.1.20 లక్షలు చెల్లిస్తున్నా. అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయాల్సి వస్తోందని మౌనిక ఆవేదన వ్యక్తం చేశారు.

● నరసాపురం డిపోలో మూడు బస్సులు తిప్పేందుకు అనుమతివ్వడంతో అప్పులు చేసి బస్సులు కొన్నా. రాయితీ సొమ్ము జమ కాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని రమ్య వాపోయారు.

బడుగు వికాసం.. అప్పులతో సతమతం

కాగితాల్లో సొమ్ములు ఖాతాల్లోకి వచ్చేదెప్పుడో ● రాయితీ సొమ్ముకు నిరీక్షణ

గత వైకాపా ప్రభుత్వ నిర్ణయాలు బడుగు, బలహీన వర్గాలకు నేటికీ శాపంగా మారాయి. కాగితాల్లో చూపిన రాయితీ సొమ్ములు ఖాతాకు జమకాకపోవడంతో అభివృద్ధి మాట ఎలాగున్నా వారిని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. అటు బ్యాంకులకు కిస్తీలు, ఇటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నామని, కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అప్పులు చేసి.. ‘జగనన్న బడుగు వికాసం’ పేరిట ఎస్సీ, ఎస్టీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేటాయించిన సుమారు రూ.22.10 కోట్ల రాయితీ నగదు నేటికీ వారి ఖాతాకు జమ కాలేదు. దళిత, గిరిజనులకు మాయమాటలు చెప్పి, ఒప్పించి వాహనాలను కొనుగోలు చేయించారు. రాయితీ మాత్రం అర్హుల ఖాతాల్లో వేయలేదు. కాగితాల్లో మాత్రం ఇచ్చినట్లు చూపడం గమనార్హం. ప్రస్తుతం వారంతా బ్యాంకు లోన్లు తీర్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

● ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీలో భాగంగా 2020-23 ఆర్థిక సంవత్సరాల మధ్య పథకం అమలు చేశారు. అవసరమైన వారికి పరిశ్రమల శాఖ ద్వారా రుణాలు అందించారు. వాహన విలువలో 45 శాతం రాయితీ కాగా, 15 శాతం లబ్ధిదారులు చెల్లించాలి. మిగిలిన మొత్తం బ్యాంకు రుణంగా మంజూరు చేశారు. దీనిని 11 శాతం వడ్డీతో వాయిదాల రూపంలో చెల్లించాలి. ఏటా ఆగస్టులో రాయితీ సొమ్ము విడుదల చేస్తామన్నా, రూపాయి కూడా విడుదల కాలేదు.

దీనిపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మంగపతి స్పందిస్తూ... దస్త్రాలన్నింటినీ ఉన్నతాధికారులకు పంపామని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.





కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటి సరస్సులో జలకాలాడేందుకు రివ్వున ఎగురుతూ వచ్చేశాయి అందాల అతిథులు. ఆకర్షించే సహజ సిద్ధ ప్రకృతి అందాలతో కొల్లేరు ప్రాంతంలో విదేశీ విహంగాలు కొన్ని రోజులుగా కనువిందు చేస్తున్నాయి. నిండు కుండలా ఉన్నా కొల్లేరులో చేపలను ఒడిసి పట్టేందుకు ఇవి చేస్తున్న విన్యాసాలు చూపరులను కట్టి పడేస్తున్నాయి. ఇక మత్స్య సంపదకు స్వర్గధామమైన కొల్లేటి సరస్సు నివాస యోగ్యం.. సంతానోత్పత్తికి పూర్తి అనుకూలం కావడంతో వేల కిలో మీటర్లు గగన తలంలో విహరిస్తూ ప్రతి ఏటా ఇక్కడకు చేరుతుంటాయి. దీంతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 9 మండలాల్లో 76,423 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు.. 190 రకాల స్వదేశీ, విదేశీ పక్షు జాతులకు, 90 రకాల మత్స్య జాతులకు స్థిర నిలయంగా మారింది. సాధారణంగా అక్టోబరు చివరి నుంచి శీతల వాతావరణం ఉండటంతో ఈ సమయంలో విదేశీ విహంగాలు కొల్లేరుకు చేరుకుంటాయి. ఫిబ్రవరి వరకు కొల్లేరుతో పాటు ఆటపాక వలస పక్షుల సందర్శన కేంద్రంలో సందడి చేస్తుంటాయి. చెరువులో నీటి మట్టం అధికంగా ఉండటంతో ఇక్కడ బోటు షికారు 20 రోజుల కిందటే నిలిపేశారు. ప్రస్తుత వాతావరణ కారణాల దృష్ట్యా మరో వారం రోజుల పాటు సందర్శకులను అనుమతించడం లేదని అటవీశాఖ రేంజరు రామలింగాచారి తెలిపారు.

కొల్లేరుకు కొత్త అందాలు

విదేశీ విహంగాలతో సందడి

డీజేలు నిషేధించాలంటూ కేసు

కలెక్టర్, ఎస్పీలకు న్యాయస్థానం నోటీసులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: డీజే శబ్దాల మోతను నిషేధించాలంటూ సీనియర్ న్యాయవాది భీమేశ్వరరావు కేసు దాఖలు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కోర్టులో దాఖలైన వాజ్యాన్ని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రత్నప్రసాద్ విచారించారు. కేసులో ప్రతివాదులైన కలెక్టర్, ఎస్పీ, జిల్లా పంచాయతీ, పౌరసంబంధాల అధికారులు, ఏలూరు కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ అథారిటీ న్యాయస్థానంలో హాజరుకావాలని ఆదేశించారు.

పీజీ సీట్ల కేటాయింపునకు కసరత్తు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సర్వజన ఆసుపత్రికి పీజీ సీట్ల కేటాయింపులో భాగంగా సౌకర్యాల పరిశీలనకు డీఎంఈ బృందం వచ్చింది. పలు విభాగాలను పరిశీలించింది. ఇక్కడి ప్రత్యేక విభాగాలకు ఒక్కో మెడికల్ పీజీ సీటు కేటాయించనున్న నేపథ్యంలో... గుంటూరు, విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాలల ఆచార్యులు ఉషారాణి, సౌజన్య తదితరుల బృందం ప్రసూతి విభాగాలను పరిశీలించింది. గురు, శుక్రవారాల్లోనూ పర్యటన కొనసాగనుంది. ఇక్కడి సౌకర్యాలపై నివేదిక రూపొందించి డీఎంఈకు అందించనున్నారు



మాట్లాడుతున్న డీఎంఈ బృందం ఆచార్యులు


అమ్మకు వందనం.. సేవల నందనం!

భీమడోలు సీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలకు ఊతం

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలే తల్లీబిడ్డలకు రక్ష అని వైద్యారోగ్య శాఖాధికారులు చెబుతుంటారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలందిస్తోంది. ఇక్కడికొచ్చే గర్భిణులకు సుఖ ప్రసవం చేయిస్తూ... మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇక్కడ ప్రతినెలా 20కి పైగా సాధారణ, శస్త్రచికిత్స ప్రసవాలు చేయిస్తున్నారు. ఆసుపత్రిలో చిన్నారులకు అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. స్కానింగ్ పరికరాలు, పూర్తిస్థాయి ల్యాబ్, మందులు, శస్త్రచికిత్స విభాగాలు పని చేస్తున్నాయి.



బాలింతలకు సూచనలిస్తున్న సూపరింటెండెంట్ సుజాత



నిరంతర పర్యవేక్షణ.. సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులను ప్రతినెలా పరీక్షిస్తూ... వారి ఆరోగ్య స్థితికి అనుగుణంగా మందులు పంపిణీ చేస్తున్నారు. కాన్పు తేదీకి వారం ముందు నుంచే ఆసుపత్రిలో వైద్యాధికారుల పర్యవేక్షణలో ప్రసూతి సేవలందిస్తున్నారు. ‘మాతా శిశు మరణాలను అరికట్టేలా పకడ్బందీగా గర్భిణులకు పరీక్షలు, ప్రసూతి సేవలు అందిస్తున్నాం. అత్యవసరమైతేనే శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు చేస్తున్నాం’ అని సూపరింటెండెంట్ డాక్టర్ సునీత తెలిపారు.



ఈమె పేరు తుమ్మ చంద్రిక. భీమడోలు వాసి. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు పిల్లలకూ సాధారణ ప్రసవాలు చేయించుకున్నారు. ఇక్కడ ప్రసూతి సేవలు బాగున్నాయని.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

రతన్‌టాటా విగ్రహం తయారీ



నమూనా విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న కరుణాకర్ ఉడయార్

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలో పారిశ్రామికవేత్త రతన్ టాటా విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. శిల్పి పెనుగొండ కరుణాకర్ ఉడయార్ నమూనా విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నమూనాను ఏడున్నర కాంస్య విగ్రహంగా తీర్చిదిద్దినట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఉండికి చెందిన ప్రజాప్రతినిధి ఇచ్చిన ఆర్డర్ మేరకు ఈ విగ్రహం తయారు చేస్తున్నట్లు చెప్పారు.

ఇన్‌ఛార్జి మంత్రికి అభినందనలు



మనోహర్‌కు పండ్ల బుట్ట ఇస్తున్న అప్పలనాయుడు తదితరులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించడంపై జనసేన ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పండ్ల బుట్ట అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట నాయకులు నగిరెడ్డి కాశీనరేశ్, వీరంకి పండు తదితరులున్నారు.

వరి చేలపై ముప్పేట దాడి!

✪ వేధిస్తున్న ప్రతికూల వాతావరణం ✪ తెగుళ్ల వ్యాప్తి.. ఆపై ఎలుకల బెడద

ఉండి, న్యూస్‌టుడే

తీవ్రమైన ఎండ.. ఉక్కపోత.. అంతలోనే ఆకస్మికంగా మేఘాలు కమ్మేసి భారీ వర్షాలు.. ఇలాంటి విభిన్న వాతావరణ పరిస్థితులు వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగవుతుండగా అన్ని ప్రాంతాల్లోనూ తెగుళ్లు, కీటకాలు, ఎలుకల బెడద వెంటాడుతోంది. అధికశాతం విస్తీర్ణంలో వరి చేలు ప్రస్తుతం చిరుపొట్ట నుంచి గింజ తయారయ్యే కీలక దశలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో మాగుడు (పొడ), బ్యాక్టీరియా ఎండాకు (బీఎల్‌బీ), మానిపండు తెగులు వ్యాప్తి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై మార్టేరు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు. వివరాలు ఇవీ..



బీఎల్‌బీ సోకిన వరి చేను

బ్యాక్టీరియా ఎండాకు (బీఎల్‌బీ)

అధికంగా నత్రజని ఎరువులు వాడటం, పొటాష్ సరిగా చల్లకపోవడం, తెగులు సోకిన పొలాల్లోంచి సాగునీటి ప్రవాహం వంటి కారణాలతో వ్యాపిస్తోన్న బ్యాక్టీరియా ఎండాకు తెగులు సమస్యాత్మకంగా తయారైంది. చేను ఈనిక దశలో ఈ తెగులు ఆశిస్తే పిలకలు ఎండిపోతాయి. కొన్ని వెన్నులే బయటకొచ్చి తాలు గింజలు ఏర్పడతాయి. నివారణకు పంట ప్రారంభంలోనే ఎకరానికి 24 కిలోల లోపు నత్రజని చల్లుకోవాలి. పొటాష్ ఎరువులు కచ్చితంగా వేయాలి. తుంగ, చిప్పెర, గరిక, ఊద, గాబెర వంటి గడ్డి జాతి కలుపు మొక్కలు నివారించాలి. తెలుగు లక్షణాలు కనిపిస్తే చేలలో నీటిని రెండు, మూడు సార్లు బయటకు మళ్లించాలని తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త వి.భువనేశ్వరి, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ కృష్ణాజీ తెలిపారు.

మానిపండు

అధికవర్షపాతం నమోదైన సంవత్సరాల్లో ఈ తెగులు వ్యాప్తి కనిపిస్తోంది. చిరుపొట్ట నుంచి పూత దశలో వర్షం లేదా మంచు ఎక్కువగా ఉన్నా ఈ తెగులు ఆశిస్తోంది. వెన్నులో గింజలకు బదులు గుండ్రని శిలీంద్ర బీజ సముదాయాలు ఏర్పడతాయి. తొలుత పసుపు, తరవాత ముదురు ఆకుపచ్చ, నలుపు రంగులోకి మారి ధాన్యం నాణ్యతను దెబ్బతీస్తోంది. ఒక ఎంఎల్ ప్రొపికొనజోల్ లీటరు నీటిలో కలిపి చిరుపొట్ట, పూత దశల్లో పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు.



తెగులు సోకిన వరి కంకులు

మాడుగు

వర్షాలు, అధిక నత్రజని చల్లిన చేలలో మొక్కలకు గాలి తగలకపోవడం, దుబ్బులు పడిపోయినచోట్ల ఈ తెగులు త్వరగా వ్యాపిస్తోంది. వెన్ను బయటకొచ్చే దశలో ఆశిస్తే తాలు గింజలు ఏర్పడి నాణ్యత, బరువు తగ్గిపోయే ప్రమాదముంది. అనుకూల వాతావరణంలో 5 శాతం హెక్సాకొనజోల్ 2.0 ఎంఎల్/ వాలిడామైసిన్ 2 ఎంఎల్/ ప్రొపికొనజోల్ ఒక ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నేడు వాల్మీకి జయంతి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన గురువారం వాల్మీకి జయంతి నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారిణి ఆర్.వి.నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాంకేతిక సాగుతో అధిక దిగుబడులు

దెందులూరు, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రం-2లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జులు, వీఆర్వోలకు ధాన్యం సేకరణపై అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలులో అధికారులు, సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఏడీఏ సుబ్బారావు, ఏవో దామా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుమతి, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారిణుల ప్రతిభ



విజేతలతో శిక్షకులు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరు క్రీడాకారిణులు ప్రతిభ చూపారు. 81+ కిలోల విభాగంలో పి.దివ్య రజతం, 77 కిలోల విభాగంలో పి.ఆర్.రీనోమోల్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, ఇండియన్ సమాఖ్య ఉపాధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య, రాష్ట్ర కార్యదర్శి టి.దిన్నాబాబు, అర్జున్ అవార్డీ, శిక్షకులు అభినందించారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీప సాంఘిక సంక్షేమ బాలల వసతి గృహాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యం, స్నానాల గదులు తదితరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వసతి గృహ పరిసరాలు, మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. వంట గది పరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన సేవలందించకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ద్వారకాతిరుమల సర్పంచి తొలగింపు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారన్న కారణంతో ద్వారకాతిరుమల పంచాయతీ సర్పంచి కుంటం స్వర్ణలతను పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ వెట్రి సెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు రూ.53,57,376 స్వాహా చేశారని వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ చేసి నిగ్గుతేల్చారు. అక్రమం రుజువు కావడంతో సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. ఉప సర్పంచిగా ఉన్న బొండాడ సావిత్రిని సర్పంచిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 15 రోజుల లోపు దుర్వినియోగం అయిన సొమ్మును స్వర్ణలత నుంచి రికవరీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వసతి గృహాల్లో డిజిటల్ బోధన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా వసతి గృహాల్లో డిజిటల్ బోధన అందుబాటులోకి తెస్తోంది. దీనికి జిల్లాలో పెనుగొండ బాలుర వసతి గృహాన్ని తొలి విడతలో ఎంపిక చేసినట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి గణపతిరావు చెప్పారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనికి ఓ గదిని కేటాయించామన్నారు. డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకునేలా పెనుగొండ పరిసరాల్లో ఇతర వసతి గృహాల విద్యార్థులను తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు



అధికారులతో సమీక్షిస్తున్న ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పరిషత్తు పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. స్థానిక జడ్పీ కార్యాలయంలో భీమవరం, జంగారెడ్డిగూడెం, రాజమహేంద్రవరం, నరసాపురం, కొవ్వూరు డివిజన్ల ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ... ఆయా మండలాల్లో మంజూరైన పనుల పురోగతిపై సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని దిశానిర్దేశం చేశారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

22న భీమడోలులో ఉద్యోగ మేళా

భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 22న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా బాధ్యుడు వాడపల్లి కిశోర్ తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, 220 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పీజీ పూర్తి చేసి... 18 నుంచి 30 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 81793 91045, 96423 87539 నంబరును సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గోదాముల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన



వివరాలు సేకరిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

కైకలూరు, న్యూస్‌టుడే: అవకతవకలకు తావు లేకుండా కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరా చేయాలని జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. కైకలూరు ఎంఎల్ఎస్ గోదాముల నుంచి చౌక దుకాణాలకు సరఫరా చేస్తున్న బస్తాల బరువులో వ్యత్యాసాలు రావడంతో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఈ నెల 15న 'ఈనాడు'లో 'చౌక బియ్యం బొక్కేస్తున్నారు' శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన జేసీ..పౌర సరఫరాల జిల్లా అధికారులతో కలిసి బుధవారం కైకలూరు గోదాములను ఆకస్మికంగా సందర్శించారు. బియ్యం బస్తాలను తూకం వేసి బరువును పరిశీలించి నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాము అధికారులు డీలర్ల సమక్షంలోనే కాటా వేసి దుకాణాలకు సరకులు సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి, డీఎస్‌వో సత్యనారాయణ రాజు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఇబ్రహీం పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల ప్రకటన వాయిదా

ఉండి, న్యూస్‌టుడే: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రకటనను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశ్చిమ డెల్టాలో ఒక ప్రాజెక్టు కమిటీ (పీసీ), 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు, 131 నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. దీనికోసం గ్రామాల వారీగా పంటలు, సర్వే సంఖ్యల వివరాలను జలవనరుల శాఖ సిద్ధం చేసింది. రైతుల వివరాలు రెవెన్యూ శాఖ తెలియజేయాల్సి ఉంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వర్షాలతో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడి ఉండొచ్చని భావిస్తున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎన్నికల ప్రక్రియ వాయిదా పడినట్లేనని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ (శెట్టిపేట) నాగార్జునరావు తెలిపారు.

సకాలంలో నష్టపరిహారం: జేసీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో 165 జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు సకాలంలో నష్టపరిహారం చెల్లించేలా చూడాలని సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో తన ఛాంబరులో ఆయా మండలాల తహసీల్దార్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కైకలూరు మండలం గోపవరం, భుజబలపట్నం గ్రామాల్లో జాతీయ రహదారి ఎలైన్‌మెంటు మార్చాలని కొందరు రైతులు విజ్ఞప్తి చేశారని, వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేసీ దిశానిర్దేశం చేశారు. 165 జాతీయ రహదారి కార్యనిర్వాహక ఇంజినీరు టి.సంజీవరాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.సత్యనారాయణరావు, తహసీల్దార్లు, భూ సేకరణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు విస్తృత ఏర్పాట్లు.. ఖరీఫ్ ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించేందుకు విస్తృత రవాణా ఏర్పాట్లు చేయాలని జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో బుధవారం అధికారులతో సమీక్షించారు. 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని క్వింటాల్‌కు కామన్ రకం రూ.2,300, ఏ గ్రేడ్ రూ.2320 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కళ్లాల నుంచే సేకరిస్తామన్నారు. జిల్లాలోని 250 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేసి.. సాంకేతిక సిబ్బంది, గోనె సంచులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

17 నుంచి నిట్‌లో టెక్రియా 2కే24



సన్నాహక కార్యక్రమంలో రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి తదితరులు

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో టెక్రియా 2కే24 కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కళాశాల ఇన్‌ఛార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం కళాశాల గ్రంథాలయం వద్ద సన్నాహక కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు తమ ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు గ్రంథాలయం వద్ద బైక్ స్టంట్‌షో, 18, 19 తేదీల్లో ఇస్రో ఎగ్జిబిషన్, టెక్నికల్ ఈవెంట్స్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డీన్ (స్టూడెంట్స్ వెల్ఫేర్) జీబీ.రాజేష్, అసోసియేట్ డీన్ వి.సందీప్, ఆచార్యులు తలారి రేష్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతల నుంచి వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు రూ.5 లక్షలు విరాళాలు సేకరించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును బుధవారం కలిసి నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో సహాయనిధికి అందజేశారు. వారిని చంద్రబాబు అభినందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.మురళీమోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు చెక్కు ఇస్తున్న వాకర్స్ ప్రతినిధులు

వృద్ధురాలి మృతదేహం వెలికితీత



సీతారత్నం(పాత చిత్రం)

భీమడోలు, న్యూస్‌టుడే: ఇంట్లో నిద్రిస్తూ కనిపించకుండా పోయిన వృద్ధురాలు ఏలూరు కాలువలో శవమై తేలిన ఘటన భీమడోలు మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వై.సుధాకర్ కథనం మేరకు... పూళ్ల గ్రామం కుమ్మరికుంట వీధికి చెందిన పచ్చ సీతారత్నం(65) ఈ నెల 14న రాత్రి భోజనానంతరం ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. వేకువజామున భర్త నిద్రలేచి చూసే సరికి ఆమె ఇంట్లో కనిపించలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా, ఆచూకీ దొరకలేదు. ఆమె భర్త మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా- వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పూళ్ల సమీప ఏలూరు కాలువలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీయించారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా, ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయిందా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ టైరు కిందపడి యువకుడి మృతి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రహదారి పక్కన నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి లారీ వెళ్లడంతో మృతిచెందిన సంఘటన టి.నరసాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన కావూరి దినేశ్‌బాబు(26) వేడుకలకు అలంకరణ పనులు చేస్తుంటాడు. ఒప్పుకొన్న పనుల నిమిత్తం మరికొందరితో కలిసి మంగళవారం రాత్రి టి.నరసాపురం వచ్చారు. అందరూ కలిసి రహదారిపై ఆగి ఉన్న లారీ పక్కనే నిద్రకు ఉపక్రమించారు. బుధవారం ఉదయం దినేశ్‌బాబు నిద్రిస్తుండగా.. మిగిలిన వారంతా కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లారు. ఆ విషయాన్ని గమనించని లారీ చోదకుడు వాహనాన్ని నడపటంతో టైరు దినేశ్‌బాబు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు ప్రకాశ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పరీక్ష నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఏఎస్సై జయకుమార్ తెలిపారు.

బాణసంచా అక్రమ నిల్వపై కేసు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దువ్వలో అక్రమంగా మందుగుండు సామగ్రి నిల్వ ఉంచిన ఇద్దరు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. ఆయన కథనం మేరకు.. దువ్వ జడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఒక దుకాణాన్ని ఉండ్రాజవరం మండలం కె సావరం గ్రామానికి చెందిన బస్వా సుధాకర్, బద్దెల అన్నవరం అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రూ.2 లక్షల దీపావళి మందుగుండు సామగ్రి నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని, మందుగుండు సామగ్రిని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

శిథిలావస్థలో స్లూయిజ్!



బీటలువారి, ఊచలుతేలి పెచ్చులూడుతున్న గోడలు

నరసాపురం మండలం పాతన వరసపురం, యలమంచిలి మండలం ఏనుగువానిలంక మధ్య ఉన్న కాజ అవుట్‌ఫాల్ స్లూయిజ్ శిథిలావస్థలో ఉంది. వశిష్ఠగోదావరికి వరదలొచ్చినప్పుడు నీరు పైకి రాకుండా షట్టర్లు వాటంతటఅవే మూసుకుపోయి, వరద తగ్గినప్పుడు షట్టర్లు తెరుచుకొని మురుగునీరు కిందికి వెళ్లేందుకు వీలుగా దీనిని గతంలో నిర్మించారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో షట్టర్లు పనిచేయడం లేదు. గోడలు బీటలువారి, ఊచలుతేలి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో తుపాన్లు, వరదలప్పుడు రెండు మండలాల్లోని గ్రామాలు, పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. అయిదేళ్ల వైకాపా ఏలుబడిలో దీనిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. -ఈనాడు, నరసాపురం



పనిచేయని షట్టర్లు

బదిలీల్లో చేతివాటం!

వైద్య ఆరోగ్యశాఖలో కలకలం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య, ఆరోగ్యశాఖలో ఇటీవల జరిగిన ఉద్యోన్నతి బదిలీల్లో భారీగా సొమ్ము చేతులు మారిన వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఓ ఉద్యోగిపై అధికారికంగా చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

లిఖిత పూర్వక ఫిర్యాదుతో.. ఏఎన్ఎంలకు ఉద్యోన్నతుల బదిలీలు ఇటీవల నిర్వహించారు. ఆ సమయంలో ఈ శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు రంగంలోకి దిగి ముడుపులు ఇస్తే నచ్చిన చోటుకు బదిలీ చేయిస్తామంటూ పలువురిని నమ్మించారు. ఎన్‌హెచ్ఎం విభాగంలో జిల్లా ప్రాజెక్టు అధికారి పి.సురేశ్ రూ. 20 వేలు తీసుకున్నట్లు ఓ ఏఎన్ఎం లిఖిత పూర్వకంగా ఫిర్యాదుతో అతడిని ఎన్‌హెచ్ఎం ఉన్నత కార్యాలయానికి సరెండర్ చేసినట్లు డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు చెప్పారు.

ధరల పెరుగుదలపై సీపీఎం ప్రజా హోరు



మాట్లాడుతున్న లింగరాజు

పెదపాడు, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు, నిరుద్యోగం పెరుగుదలను నిరసిస్తూ... నవంబరు 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజా హోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు తెలిపారు. స్థానిక నర్రా ఆంజనేయులు స్మారక భవనంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమై మాట్లాడారు. నవంబరు 18న జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని ప్రజా హోరును విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'టెట్'కు 52 మంది గైర్హాజరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు'(టెట్) కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 370 మంది అభ్యర్థులకు 318 మంది హాజరయ్యారు. మిగతా 52 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.

వినాయకుడి కిరీటం అపహరణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: వినాయకుడి విగ్రహంలో వెండి కిరీటం అపహరణకు గురైన ఘటన వేల్పూరులో చోటుచేసుకుంది. గ్రామంలోని విఘ్నేశ్వర ఆలయంలో విగ్రహానికి ఉన్న 500 గ్రాముల వెండి కిరీటాన్ని మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అదే గ్రామానికి చెందిన హరి వెంకట రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మూర్తి తెలిపారు.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న బాలురు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యోగా పోటీల్లో కైకరం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాతినిండి నాగరాజు, ఉప్పాడ రేవంత్ వసంత్ కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు, పీడీలు పాపాయమ్మ, నాగసుధ, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. నవంబరులో నెల్లూరు వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

బలవర్ధక ఆహారంతో ఆరోగ్యం


తినుబండారాలు చూపుతున్న విద్యార్థినులు

నిడమర్రు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతిరోజు బలవర్ధక ఆహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఉప సర్పంచి రుద్రరాజు కొండ్రాజు అన్నారు. పత్తేపురం ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థినులు తాము చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. రుచికరంగా వంటలు తయారు చేసిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉంగుటూరు: ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు

సాధనతో మెరుగైన ఫలితాలు

పెదవేగి, న్యూస్‌టుడే: విద్యార్థులు నిత్య సాధనతో మెరుగైన ఫలితాలు సాధించగలరని ప్రధానోపాధ్యాయులు ఎస్వీఎస్ ఆర్. శైలజ అన్నారు. పెదవేగి, కొప్పాక ఉన్నత పాఠశాల్లో బుధవారం అభ్యసన వైకల్యం(డిస్లెక్సియా)పై బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ప్రదర్శన చేపట్టారు. వారు మాట్లాడుతూ... అభ్యాసన వైకల్యంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఉంగుటూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అభ్యసన వైకల్యం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐఈఆర్టీ సిబ్బంది గ్రామ వీధుల్లో అవగాహన ప్రదర్శన చేపట్టారు.

రెవెన్యూ సిబ్బందితో ఆర్డీవో సమీక్ష

దెందులూరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ బుధవారం సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు, ఆన్‌లైన్ సేవలు, అపరిష్కృత సమస్యలపై సమీక్షించారు. ఆయా అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల తిప్పలు.. అమ్మకానికి ఇళ్లు..!

జగనన్న కాలనీ లబ్ధిదారుల వ్యథ

సొంతింటి కల సాకారమవుతోందని సంబరపడ్డారు. ప్రభుత్వం స్థలంతో పాటు ఇళ్ల మంజూరు చేయడంతో ఉప్పొంగిపోయారు. కానీ, ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. గృహ నిర్మాణాలు చేసిన అప్పులు పెరిగిపోవడం.. ఆయా కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇళ్ల అమ్మకానికి లబ్ధిదారులు మొగ్గుచూపుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

★ ఏలూరు నియోజకవర్గంలోని చొదిమెళ్ల, పోణంగి, కొమడవోలు జగనన్న లేఅవుట్లలో సుమారు 17 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఏడాదిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించిన నాటి పాలకులు, అధికారులు... ధనార్జనే ధ్యేయంగా దోపిడీ సాగించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం చాలకపోవడం.. ఊళ్లకు దూరంగా స్థలాలు కేటాయించడం... ఇతరత్రా కారణాలతో కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించలేదు. మరికొందరు అప్పులు చూసి నిర్మాణాలు పూర్తి చేశారు. ఇంకొందరు పునాదుల దశ వరకు నిర్మాణాలు చేపట్టి... ఆపై ఆపేశారు. కొన్ని చోట్ల గుత్తేదారులు పేకమేడల్లా ఇళ్లు నిర్మించారు. నాణ్యత లోపంతో గోడలు బీటలు వారుతున్నాయి. మరోవైపు ప్రస్తుతం నివాసముంటున్న గృహాలకు అద్దెలు చెల్లించి రావడం, అప్పులు పెరిగిపోవడంతో జగనన్న కాలనీల్లోని ఇళ్లను అందివచ్చిన ధరకు అమ్ముకుంటున్నారు. ప్రాంతం, ఇంటి నిర్మాణం తీరు తరాలను బేరీజు వేసు కొని... రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇంటిని విక్రయిస్తున్నారు.

లేఅవుట్	మంజూరైనవి	పూర్తయినవి	అసంపూర్తిగా ఉన్నవి
చొదిమెళ్ల	4565	129	4436
కొమడవోలు	5666	317	5349
పోణంగి	7918	155	7763


పోణంగిలో అసంపూర్తిగా గృహ నిర్మాణాలు

వైకాపా నేతల దందా...

లబ్ధిదారుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అయితే వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులు పెద్దఎత్తున దందాకు తెరలేపారు. సొంతింటి కల సాకారం చేస్తామని నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే చెప్పినా, ఆ దిశగా అడుగులు వేయలేదు. కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నివాసం ఉండటానికి ఆసక్తి చూపడం లేదు. ఇదే అదనుగా కొందరు వైకాపా నాయకులు అవతారమెత్తి ఇళ్లను విక్రయాలకు పెడుతుండటం గమనార్హం. 'కాలనీల్లో అనధికారిక క్రయవిక్రయాలు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. ఈ విక్రయాలకు సంస్థకు ఎలాంటి సంబంధం ఉండదు' అని గృహనిర్మాణ సంస్థ ఏలూరు అర్బన్ డీఈఈ రామకృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: శాంతినగర్ ఆర్ రోడ్డులోని కాలువల్లో మురుగు నీరు పారడం లేదు. రోజుల తరబడి పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **- వి.వి.ఎస్.ఆర్య, స్థానికుడు**

సమాధానం: పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

సమస్య: విద్యానగర్ గాంధీబొమ్మ రోడ్డులోని మురుగు కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. వాడుక నీరు ముందుకు కదలడం లేదు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. **- వి.రామ్మోహనరావు, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువను శుభ్రం చేయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

సమస్య: తంగెళ్లమూడి ద్వారకానగర్ రెండో రోడ్డులోని మురుగు కాలువలో నెలల తరబడి పూడిక తీయడం లేదు. మురుగు ముందుకెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- సీహెచ్ సుబ్రహ్మణ్యం, స్థానికుడు**

సమాధానం: ఒకట్రెండు రోజుల్లో కాలువలో పేరుకుపోయిన పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

సమస్య: అశోకనగర్ పాత ఆంధ్రాబ్యాంకు రోడ్డులో ఆరు రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. చీకట్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం. **- మోహన్‌రావు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: ఆర్ఆర్ పేట నందమూరి తారక రామారావు పార్కు వెనుక కోస్టల్ బ్యాంకు రోడ్డులోని కాలువలో మురుగు పేరుకుపోయింది. దుర్వాసన రావడంతోపాటు దోమల బెడద అధికంగా ఉంటోంది. **- ఎ.శ్రీనివాసరావు, స్థానికుడు**

సమాధానం: సమస్య నా దృష్టికి రాలేదు. వెంటనే కాలువలో పూడిక తీయిస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రభాకర్

'పల్లె పండగ'తో అభివృద్ధికి శ్రీకారం

పెదపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'పల్లె పండగ'తో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు, తోటగూడెం, వసంతవాడ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పెదపాడులో రూ.50 లక్షలతో సిమెంట్ రహదారులు, మరో రూ.10 లక్షలతో మురుగు కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. తోటగూడెంలో రూ.2.10 లక్షలతో మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎన్డీయే నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

★ అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడిలో తెదేపా నాయకుడు వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యాన అయ్యప్ప, భవానీ మాలధారులకు భిక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు.

ప్రగతి వెలుగులు నింపుదాం


క్రొవ్విడిలో శిలాఫలకం వద్ద ధర్మరాజు తదితరులు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రగతి వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చానమిల్లి, ఎనికేపల్లి, సిద్ధాపురం, అడవికొలను, నిడమర్రు, బావాయిపాలెం గ్రామాల్లో బుధవారం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. సర్పంచి పాలా వెంకటేశ్వరరావు, ఎంపీపీ ధనకొండ ఆదిలక్ష్మి, ఎంపీడీవో విజయకుమారి, తహసీల్దార్ నాగరాజు, నాయకులు ముత్యాలస్వామి, ఇంద్ర, నిమ్మల దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: పల్లెలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. గణపవరం శివాలయ సమీపంలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. నాయకులు రామకృష్ణంరాజు, శ్రీను, సునీత, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినీ మాల

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్ర్కీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్ర్కీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్ర్కీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	దక్షిణ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	జిగ్రా
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్ర్కీన్ 1	వేట్టయన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్ర్కీన్ 2	వేట్టయన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్ర్కీన్ 3	విశ్వం
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్ర్కీన్ 4	విశ్వం

భక్తిశ్రద్ధలతో సాయి సత్య వ్రతాలు


బాబాను దర్శించుకుంటున్న చంటి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తంగెళ్లమూడి సాయినాథ్ నగర్‌లోని శిర్డీ సాయినాథ ధ్యాన మందిరంలో మూడ్రోజులపాటు కొనసాగిన వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు భక్తులు సాయి సత్య వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఉదయం సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. మహాన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే బడేటి చంటి సాయినాథుని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన్ను ధ్యాన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు మానెం సురేశ్ సత్కరించారు.

భారీ అన్నసమారాధన

నారాయణపురం(ఉంగుటూరు): నారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో సమాప్తమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయావరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకుడు హనుమంతు నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: విద్యానగర్ పిండిమర రోడ్డులోని కాలువలో పూడిక తీయించారు. కాలువలో మురుగు పేరుకుపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడు'లో ఈ నెల 9న వార్త ప్రచురితమైంది. నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి, పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువను శుభ్రం చేయించారు.

వెలిగిన వీధి దీపం.. సత్రంపాడు హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి శిర్డీ నగర్ వెళ్లే మార్గంలో వీధి దీపం ఎట్టకేలకు వెలిగింది. పది రోజులుగా దీపం వెలగకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో 15న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించారు. సిబ్బందిని పంపి వీధి దీపాన్ని బాగు చేయించారు.

కాలువలు శుభ్రం.. తూర్పువీధి సంతాన వేణుగోపాలస్వామి ఆలయ రోడ్డులోని మురుగు కాలువలను సిబ్బంది శుభ్రం చేశారు. కాలువల్లో పూడిక పేరుకుపోవడంపై ఈ నెల 11న ప్రచురితమైన వార్తకు నగరపాలక అదనపు అధికారి శివారెడ్డి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయించారు.

ఘనంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం


విశేషాలంకరణలో అమ్మవారు

భీమడోలు, న్యూస్‌టుడే: నరెడ్లగూడెంలో దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా బుధవారం కనకదుర్గమ్మను గ్రామ వీధుల్లో ఊరేగించారు. తొలుత అమ్మవారి గద్దె వద్ద నుంచి అష్టలక్ష్ములతో రూపొందించిన ప్రత్యేక వాహనంపై ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య భీమడోలులో ఊరేగించారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ


ఉంగుటూరు: కషాయం తయారీని వివరిస్తున్న ఏవో

పెదవేగి, పెదపాడు, న్యూస్‌టుడే: సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారులు ముత్యాల ప్రియాంక, వానపల్లి ప్రదీప్‌కుమార్ సూచించారు. పెదవేగి, పెదపాడు మండలాల్లోని నడిపల్లి, బాపిరాజుగూడెం, కొత్తూరు, కొత్తముప్పర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ... అధికారులు, శాస్త్రవేత్తలు సూచనలు పాటిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కోరారు. అంతకుముందు వరి పొలాలను పరిశీలించి, సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.

ఉంగుటూరు: ఖరీఫ్ నుంచి రైతులు తమకు నచ్చిన మిల్లులో ధాన్యం విక్రయించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎన్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. నారాయణపురంలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని మాట్లాడారు. తూటి కాడ కషాయం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచి అలకనంద, మాజీ ఎంపీపీ గోలి శ్రీను, నాయకులు, వీఏఏలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక మూడు గుళ్ల ప్రాంతంలో శ్రీసత్యసాయి సేవా సంస్థలు, బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యాన మహిళలకు మగ్గం, జర్దోసిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సేవా సమితి కన్వీనర్ వర్ధినేడి సత్యసాయి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏపీ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి నౌపుడు నెహ్రూబాబు డిమాండ్ చేశారు. ఈ నెల 18న విజయవాడలో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలంటూ ముద్రించిన గోడపత్రాలను బుధవారం తంగెళ్లమూడిలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1.34 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. గత అయిదేళ్లుగా ఎలాంటి పరిహారం అందలేదన్నారు. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు కావడం లేదని, ఫలితంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు వర్మ భాస్కర్, కుమార్, సత్తిబాబు, నారాయణ, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రహదారులు గుల్ల!

ఆక్వా చెరువుల తవ్వకాలతో అవస్థలు

నిడమర్రు, న్యూస్‌టుడే: జిల్లాలోని డెల్టా ప్రాంతంలో నిబంధనలు పాటించకుండా తవ్విన చేపల, రొయ్యల చెరువుల కారణంగా రహదారులు పాడవుతున్నాయి. ఫలితంగా ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను ఆనుకుని చెరువులు తవ్వడంతో సమస్య నెలకొంటోంది. దీనికితోడు సామర్థ్యానికి మించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో మరింత దెబ్బతింటున్నాయి. వాస్తవానికి చేపలు, రొయ్యల సాగుదారులు తమ సొంత స్థలం 3 మీటర్ల మేర వదిలి చెరువులు తవ్వుకోవాలి. చెరువుల నుంచి లీకయిన నీరు వెళ్లేందుకు బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. కొందరు సాగుదారులు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఫలితంగా రహదారులు అనతి కాలంలోనే పాడవుతున్నాయి.

పట్టించుకునే వారేరి?

ఈ దారుల్లో నిత్యం రెవెన్యూ, ర.భ. శాఖల అధికారులు రాకపోకలు సాగిస్తున్నా... ఇవేమీ పట్టడం లేదు. జిల్లా వ్యాప్తంగా 2.6 లక్షల ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులున్నాయి. వీటిలో సగానికి పైగా నిబంధనలు పాటించకుండా తవ్వినవే. ప్రధానంగా నిడమర్రు మండలంలో 10 వేల ఎకరాల్లో చెరువులుండగా- గణపవరం- నారాయణపురం, నిడమర్రు- అడవికొలను, పెదనిండ్రకొలను- బైనేపల్లి మార్గాల్లో నిబంధనలు పాటించకుండా చెరువులు తవ్వేస్తున్నారు. రహదారులు పాడైనా, వాటిని మరమ్మతులు చేయించడంలో చొరవ చూపడం లేదు. 'నిడమర్రు మండలంలో చేపల చెరువుల కారణంగా పాడవుతున్న రహదారులను గుర్తిస్తాం. ఎవరి కారణంగా దెబ్బతిన్నాయో తెలుసుకొని, వారితోనే మరమ్మతులు చేయిస్తాం. ఈ విషయమై ఎఫ్‌డీవోతోనూ చర్చిస్తాం' అని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.


పత్తేపురం వద్ద రోడ్డు పక్కన నిలిచిన నీరు


పెదనిండ్రకొలను- బైనేపల్లి మార్గంలో...


గడియార స్తంభం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సత్యనారాయణ

నేరాల నియంత్రణకు చర్యలు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆదేశానుసారం మార్కెట్ ప్రాంతం, హుండీ సెంటర్, అజంతా సెంటర్, బుద్ధ పార్కు, చేపల మార్కెట్, అంబికా థియేటర్ తదితర ప్రాంతాల్లో బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీలు చేశారు. దుకాణాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణంపై అవగాహన కల్పించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఏలూరు నేరవార్తలు: సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుబ్బారావు సూచించారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం స్థానిక ఆదిత్య కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై క్రాంతి ప్రియ, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపట్నుంచి రీసర్వే గ్రామసభలు

భీమడోలు, న్యూస్‌టుడే: మండలంలో భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 18 నుంచి 22 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రమాదేవి తెలిపారు. పోలసానిపల్లిలో 18న, దుద్దేపూడిలో 19న, కోడూరుపాడులో 22న సభలు ఉంటాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఉంగుటూరు: రీసర్వే పూర్తైన గ్రామాల్లో శుక్రవారం నుంచి సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. భూ విస్తీర్ణంలో తేడాలు, ఉమ్మడి భూముల విభజన, వారసత్వం పేర్ల నమోదు, సమస్యలు, రైతు దస్త్రాల్లో మార్పులపై గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. 18న వెల్లమిల్లి, 19న బొమ్మిడి, 22న కాగుపాడు, 23న రావులపర్రు, 24న రాచూరు, 25న దొంతవరంలో సభలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

దెందులూరు: మండలంలో భూముల రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. 18న మేదినరావుపాలెం, 19 తిమ్మన్నగూడెం, 22న నరసింహాపురం, 23న శ్రీరామవరం, 24న గుడిగంట, 25న అక్కిరెడ్డిగూడెం, 26న సానిగూడెం, 29న గాలాయిగూడెం, 30న కొత్తపల్లి సభలుంటాయని చెప్పారు. నవంబరు 1న చల్లపల్లి, 2న ఉప్పుగూడెం, 5న కొమిరేపల్లిలో గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఏలూరు గ్రామీణ: కాట్లంపూడి, కొక్కిరాయిలంకలో ఈ నెల 18, 19 తేదీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం.. నిందితుడిపై కేసు

పోలవరం, న్యూస్‌టుడే: శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఉంగుటూరు మండలం కాగుపాడుకు చెందిన పోట్ల పెద్దిరాజు.. పోలవరం మండలం ఎల్ఎన్డీపేటకు చెందిన చింతలచెరువు సుందరభాస్కర్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, రూ.2.50 లక్షలు తీసుకుని మోసం చేశాడు. దీనిపై బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పెద్దిరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

సత్వరం ప్రజా సమస్యల పరిష్కారం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బడేటి చంటి అధికారులను ఆదేశించారు. స్థానిక బడేటి విడిది కార్యాలయంలో పలువురు ప్రజలు ఆయన్ను కలిసి తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే, పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల మంత్రులను ఎమ్మెల్యే చంటి బుధవారం కలిశారు. ఏలూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై వారితో చర్చించారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!



నిడమర్రు మండలం పెదనిండ్రకొలను పంచాయతీ నరసింహపురం వద్ద ఓ విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుపోయాయి. విద్యుత్తు తీగలను సైతం తాకి ప్రమాదకరంగా మారాయి. పిల్లలు, మూగజీవాలు అటువైపు వెళితే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముంది. సిబ్బందిని పంపి పాదులు తొలగిస్తామని విద్యుత్తు జేఈ శ్రీకాంత్ తెలిపారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు**

నరక దారులు!

ఉంగుటూరు మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రావులపర్రు- దొంతవరం, దొంతవరం- మౌంజిపాడు రోడ్లు ఛిద్రంగా మారాయి. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు పడుతున్నారు. దారి కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉంగుటూరు**



ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత


స్వాధీనం చేసుకున్నవాహనాలు, నిందితుడితో పోలీసులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని వీరవల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఏలూరు సమీపంలోని కొత్తూరుకు చెందిన పోట్రు సాయిశేఖర్ వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, విజయవాడ సత్యనారాయణపురం, గుంటూరు జిల్లా మంగళగిరి, ఏలూరులో ఒకటి చొప్పున ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా అపహరించుకుపోయాడు. బుధవారం తిప్పనగుంట బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పలు చోట్ల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 5 ద్విచక్ర వాహనాలతో సహా నిందితుడ్ని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు. ఎస్పీ గంగాధర్, సీఐ సత్యనారాయణ వీరవల్లి పోలీసుల్ని అభినందించారు.

కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న లారీని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్. సతీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా, మార్గం మధ్యలోని కలపర్రు టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలవరం

•పోలవరం •చింతలపూడి

నవరాత్రి లడ్డూలకు వేలం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా గంగానమ్మ ఆలయంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన లడ్డూలకు వేలం నిర్వహించారు. 110 కేజీల లడ్డూను రూ.1.25 లక్షలకు నడిపల్లి అంజనరావు, 90 కేజీల లడ్డూను రూ.55 వేలకు వాసవి నగేష్ కైవసం చేసుకున్నారు.


పాటదారులకు లడ్డూ అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

పోలవరం, న్యూస్‌టుడే: పైడిపాక పునరావాస కాలనీలో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

ఏఈగా జ్వాలా దీప్తి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పురపాలక ఏఈగా జ్వాలా దీప్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గుడివాడ పురపాలక సంఘం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ ఏలూరు నగరపాలక సంస్థ ఏఈగా వెళ్లారు. అలాగే పట్టణంలో 4, 5, 6 సచివాలయాల శానిటరీ కార్యదర్శులు బదిలీ కావడంతో వారి స్థానాల్లో ఇతర పురపాలక సంఘాల నుంచి ముగ్గురు జంగారెడ్డిగూడెం వచ్చారని కమిషనర్ రమణ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు కొయ్యలగూడెం సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎం.రాజు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్హత కలిగి, వార్షిక ఆదాయం రూ.2.50లక్షలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 21 లోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో తమ వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు.

కార్మికుల ఆరోగ్య పరీక్షలకు ప్రాధాన్యం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరీక్షలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పురపాలక ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. కార్మికులు ధరించేందుకు రూ.1.30 లక్షల విలువైన గ్లౌజులు, మాస్కులతో పాటు చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రం చేసేందుకు ఉపయోగించే సామగ్రిని బుధవారం ఆయా సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు. పురపాలక కమిషనర్ కేవీ రమణ, శానిటరీ మేస్త్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలపై విచారణ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భూ వివాదాలపై అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టినట్లు తహసీల్దార్ చల్లన్నదొర బుధవారం పేర్కొన్నారు. రాజవరం పరిధిలోని సర్వే నంబర్లు 219/1, 219/2,లలో 2.80ఎకరాలు, 378/2లో 1.50 ఎకరాలతో పాటు మరో 30 సెంట్లు భూమి సరిహద్దు రైతు ఆక్రమించుకుని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ గ్రామానికి చెందిన చీకట్ల గంగరాజు తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు.

గృహ యోగానికి వడివడిగా అడుగులు!

ఇంటింటి సర్వేతో లబ్ధిదారుల్లో ఆనందం

చింతలపూడి, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కొత్త వారికే కాకుండా 2014-19 మధ్య తెదేపా హయాంలో నిర్మాణాలు ప్రారంభించి.. బిల్లుల చెల్లింపు సమస్యతో సగంలో ఆపేసిన వారికి తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రస్తుతం ఇంటింటి సర్వే చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తెదేపా హయాంలో 2014-19 మధ్య ఎన్టీఆర్ గృహ నిర్మాణం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేశారు. 2008 పల్స్ సర్వే అనుసరించి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రూ.2 లక్షల చొప్పున దశల వారీగా చెల్లింపులు చేయగా.. ఎన్టీఆర్ గృహ నిర్మాణంలో రూ.1.5 లక్షలు కేటాయించారు. అయితే అప్పటి ప్రభుత్వ పాలన ముగిసే సమయానికి వందల మంది లబ్ధిదారులకు వివిధ స్థాయిల్లో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కార్ తమ హయాంలో ఇళ్లు కాదు, ఊళ్లే కడతామంటూ గొప్పలకు పోయి వారి కాలంలో దాన్ని అటకెక్కించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గృహనిర్మాణ పథకంలో మార్పులు చేస్తూ, లబ్ధిదారులకు అందించే సాయం భారీగా పెంచింది. మరో వైపు తమ హయాంలోని అసంపూర్తి బిల్లుల చెల్లింపులపైనా దృష్టి పెట్టింది. ఈ మేరకు సంబంధిత అధికారులు ప్రస్తుతం సర్వే చేస్తున్నారు.


చింతలపూడిలో సర్వే చేస్తున్న అధికారులు

● మండలం	✦ సర్వే చేసిన ఇళ్లు
● చింతలపూడి	✦ 4,177
● పోలవరం	✦ 5,409

ప్రత్యేకంగా యాప్

ప్రభుత్వం 'ఏపీఎస్ హెచ్‌సీఎల్' యాప్ రూపొందించి సర్వే చేసిన ఇళ్ల వివరాలను అందులో పొందుపరుస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 4,177 ఇళ్లు, పోలవరం నియోజకవర్గంలో 5,409 ఇళ్లకు సంబంధించిన బిల్లుల బకాయిలు ఉన్నట్లు తేల్చారు. ప్రస్తుతం గృహ నిర్మాణ సంస్థ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో తిరుగుతున్నారు. ఇల్లు పూర్తయిందా? అదే పరిస్థితిలో ఉందా? పూర్తయిన ఇంట్లో లబ్ధిదారులే ఉంటున్నారా? తొలి బిల్లు పొంది, పునాది స్థాయిలోనే నిలిచినవి ఏమైనా ఉన్నాయా? ఉంటే వారికి ఇప్పుడు పథకం మంజూరు చేస్తే కట్టుకోవడానికి సిద్ధమా.. లాంటి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు.

సర్వే చేస్తున్నాం

'2014-19 మధ్య మంజూరై సగంలో ఆగిపోయిన, పూర్తి చేసిన ఇళ్లను సర్వే చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నాము' అని గృహ నిర్మాణ సంస్థ డీఈ రంగారావు తెలిపారు.

సాగునీరు విడుదల


విడుదల చేస్తున్న రాముడు, అధికారులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అలివేరు వద్ద గుబ్బలమంగమ్మ జల్లేరు జలాశయం ప్రధాన పంట కాలువ నుంచి సాగుకు బుధవారం నీటిని విడుదల చేశారు. దొరమామిడి సర్పంచి తెల్లం రాముడు, జనసేన మండల అధ్యక్షుడు మెట్ట బుచ్చిరాజు, ప్రత్యేక చిన్న తరహా జలవనరుల డీఈ ఆనంద్‌కుమార్, ఏఈ సురేశ్ పాల్గొన్నారు.


లక్ష్మీకుమారికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం-కన్నాపురం రహదారిలో ఓ ప్రైవేటు పాఠశాల, జూనియర్ కళాశాల, ఆసుపత్రులు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్న ప్రయత్నాలపై స్థానిక మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకుమారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు ప్రకారం దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కేతవరం ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి పంతగాని ధనుష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంవీ అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా తర్ఫీదు ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు రమేశ్, యోగా శిక్షకుడు వెంకటేశ్వరరావును బుధవారం అభినందించారు.


ధనుష్

ట్యాంక్ నిర్మాణ స్థలం పరిశీలన

చింతలపూడి, న్యూస్‌టుడే: అమృత్ పథకంలో భాగంగా నగర పంచాయతీలో ఇంటింటికి తాగునీటి సరఫరా నిమిత్తం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నాగిరెడ్డిగూడెంలో ప్రతిపాదించిన ప్రాంతాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తమ్మిలేరు జలాశయం నుంచి నీటిని ఏ విధంగా మళ్లించాలి, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కమిషనర్ పావని, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామ సభలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలంలో భూములు రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో ఈ నెల 18 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్లీవజోజి తెలిపారు. రైతులు అర్జీలు అందించవచ్చన్నారు. 18న పట్టెన్నపాలెం, 19న అక్కంపేట, 22 శ్రీనివాసపురం, 23 పుల్లెపూడి, 24 మైసన్నగూడెం, 25 పెద్దిపల్లి, 26 చక్రదేవరపల్లి, 29 రామచర్లగూడెం, 30 తిరుమలాపురం, నవంబరు 1న పంగిడిగూడెం, 2 లక్కవరం, 5 దేవులపల్లి, 6 అమ్మపాలెం, 7 నిమ్మలగూడెంలో సభలు జరుగుతాయన్నారు.

గ్రామాల సమగ్ర ప్రగతికి కృషి


రంగాపురంలో సీసీ రహదారి పనులను ప్రారంభిస్తున్న రోషన్‌కుమార్

లింగపాలెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న 'పల్లె పండగ' కార్యక్రమంతో గ్రామాలకు కొత్త కళ సంతరించుకుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని అయ్యప్పరాజుగూడెం, కలరాయనగూడెం, భోగోలు, ములగలంపాడు, రంగాపురం, బాదరాల గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. వేములపల్లిలో సచివాలయ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గరిమళ్ల చలపతిరావు, ముసునూరి రాము, నందిగాం సీతారాం తిలక్, వేంపాటి సత్తిబాబు, బొంతు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ● లింగపాలెంలో మద్యం దుకాణం జనావాసాలకు సమీపంలో ఉందని, ఈ కారణంగా కాలనీ వాసులకు ఇబ్బంది కలుగుతుందంటూ గ్రామస్థులు కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల సమగ్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెం, కొమ్ముగూడెం, కేఆర్ పురం, కోయరాజమండ్రిలో సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. నాయకులు కరాటం రాంబాబు, సాయి, పాదం నాగకృష్ణ, గడ్డమణుగు రవికుమార్, మెట్టా బుచ్చిరాజు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో పూజ చేస్తున్న బాలరాజు

తుపాను హెచ్చరికలకు అనుగుణంగా జాగ్రత్తలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు అందజేస్తున్న తుపాను హెచ్చరికలకు అనుగుణంగా వరి కోతలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కేఆర్ పురం సహాయ సంచాలకుడు బుజ్జిబాబు రైతులకు సూచించారు. సీతంపేట, యర్రంపేట-2 సచివాలయాల పరిధిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేటలో ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్రపరిశీలనలో భాగంగా వరి సాగును పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


సీతంపేటలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వెలగపాడు, అల్లంచర్లరాజుపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వెలగపాడులో పలువురు కౌలు రైతులు తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అల్లంచర్లరాజుపాలెంలో రాయితీపై వక్క మొక్కలు అందించాలని ఏవో బి.సుమలతను కోరారు.

పోలవరం, న్యూస్‌టుడే: జిల్లెల్లగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో పంటల మార్పిడి, సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు అవగాహన కల్పించారు.

మూత్రశాలలకు తాళాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లోని పురుషులు, మహిళల మూత్రశాలలకు తాళాలు పడ్డాయి. నిర్వహణ లోపంతో ఆయా ప్రాంతంలో తీవ్ర దుర్గంధం వస్తోంది. పరిసరాలు సైతం అధ్వానంగా మారాయి. దీనిపై ఆర్టీసీ డీఎం గంగాధరరావు మాట్లాడుతూ రాత్రి వేళల్లో తాళాలు వేయిస్తున్నామన్నారు. మూత్రానికి మాత్రమే ఉపయోగించాల్సిన వాటిని ఇష్టానుసారంగా వాడుతున్నారన్నారు. వీటితో పాటు మరికొన్ని ఉన్నందున రాత్రి వేళల్లో వాటిని ఉపయోగిస్తున్నారన్నారు.



భయపెడుతున్న విద్యుత్తు తీగలు



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిఖామణి చర్చి రోడ్డులో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో కింద కంటూ ఉన్నాయి. ఈ కారణంగా కండక్టర్‌కు ప్లాస్టిక్ గొట్టాలు తొడిగి చాలా కాలంగా నెట్టుకొస్తున్నారు. ప్రమాదం జరిగేందుకు అవకాశం ఉన్నందున తీగలు కిందకు వేలాడకుండా సరిచేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. సమస్యను విద్యుత్తు ఈఈ రాధాకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం కొత్త స్తంభం వేయించి సమసయ లేకుండా చేస్తామని చెప్పారు.

దారంతా బురద!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులతో పాటు గ్రామ ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్లే పరిస్థితి కూడా లేదు. గోతులను చాలా కాలం నుంచి పూడ్చకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. 'రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేయిస్తాము'అని ఆర్ అండ్‌బీ డీఈ హరికృష్ణ తెలిపారు.



ఇప్పటికి ఇది.. ఎప్పటికో పూర్తి..

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం శివారు కన్నాపురం మార్గంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు సగంలో నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు, ఇసుక కొరతతో పనులు నిలిపివేసినట్లు గుత్తేదారు చెబుతున్నారు. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ జంగారెడ్డిగూడెం డీఈఈ హరికృష్ణ మాట్లాడుతూ ఇసుక కొరత కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. త్వరలోనే ర్యాంపులు అందుబాటులోకి వస్తాయని, ఆ వెంటనే రహదారి నిర్మాణం పూర్తిచేయిస్తామని చెప్పారు.



ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: సిమెంట్ తూరలు తీసుకెళుతున్న ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి కొల్లు మోషే(30) అనే యువకుడు బుధవారం మృతి చెందినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రామానుజపురానికి చెందిన మోషే బయ్యనగూడెంలో పొలానికి అవసరమైన తూరలు కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తీసుకెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఉద్యోగం పేరుతో మోసం: నిందితుడిపై కేసు

పోలవరం, న్యూస్‌టుడే: శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, నగదు తీసుకుని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఉంగుటూరు మండలం కాగుపాడుకు చెందిన పోట్ల పెద్దిరాజు.. పోలవరం మండలం ఎల్ఎన్డీపేటకు చెందిన చింతలచెరువు సుందర భాస్కర్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, రూ.2.50 లక్షలు తీసుకుని మోసం చేశాడు. దీనిపై బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పెద్దిరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: గవరవరంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న అజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు.

శిరస్త్రాణం లేని ప్రయాణం ప్రమాదకరం

చింతలపూడి, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా శిరణాస్త్రం ధరించాలని, అది లేని ప్రయాణం ప్రమాదకరమని ఎస్సై కుటుంబరావు అన్నారు. ఈ మేరకు నగర పంచాయతీలో పలువురు వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. శిరస్త్రాణం లేకుంటే జరిమానా విధిస్తామని చెప్పారు.


పొలాలకు వెళ్లే దారేది?

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పి.రాజవరంలో వ్యవసాయ భూములకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఇటీవల వర్షాలకు అటు వైపు ఉన్న కాలువ వద్ద చప్టా కొట్టుకుపోయి తూరలు మాత్రమే మిగిలాయి. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు సరైన దారిలేక నానా అవస్థలు పడుతున్నారు.



పట్టభద్రుల ఓటు నమోదుకు ప్రాధాన్యం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఓటు నమోదుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. ఓటు నమోదుకు సంబంధించిన ప్రత్యేక విభాగాన్ని తెదేపా కౌన్సిలర్ కరుటూరి రమాదేవి ఇంటి వద్ద బుధవారం ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఆఫ్, ఆన్‌లైన్లలోనూ ఓటు నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు శేషు తెలిపారు. కార్యక్రమంలో రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, నంబూరి రామచంద్రరాజు, ఈడా సూర్యచంద్రశ్రీనివాస్, షేక్ ముస్తఫా, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఓటు హక్కు నమోదు ప్రాధాన్యాన్ని వివరిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో కొయ్యలగూడెంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆర్ఐ మణిదివ్య పాల్గొన్నారు.

వేలేరుపాడు, న్యూస్‌టుడే: జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ డీవీ సత్యనారాయణ అన్నారు. వేలేరుపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'స్వీప్' కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన వారు ఓటర్లుగా నమోదు కావాలని ఉప తహసీల్దార్ షకీలు న్నీసా అన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లికి చెందిన పశుపోషకుడు గుడెల్లి సూర్యచంద్రానికి చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. మేతకు తోలుకెళ్లిన సమయంలో పొలంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు పరివర్తకానికి తగలడంతో ఈ ప్రమాదం చోసుకున్నట్లు బాధితుడు తెలిపారు. చనిపోయిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని చెప్పారు.

ప్రమాదాల్లో గాయపడిన వారికి సాయం

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమలో ఇటీవల వేర్వేరు రహదారి ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరికి పోలవరం మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.5వేల చొప్పున బుధవారం అందజేశారు.

అద్దె ఇళ్లు.. అరకొర వసతులు

భోగోలు (లింగపాలెం), న్యూస్‌టుడే: సమస్యల ఒడిలో అంగన్‌వాడీ కేంద్రాలు కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. చాలా కేంద్రాలకు సొంత గూడు లేదు. అద్దె ఇళ్లలో నిర్వహించే వాటిలో సరైన వసతులు ఉండటం లేదు. సరైన ప్రాంగణాలు లేకపోవడంతో చిన్నారులకు ఆటపాటలు సైతం కరవయ్యాయి. కొన్ని చోట్ల అయితే అన్నీ ఒక్క గదితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. లింగపాలెం మండలంలో మొత్తం 59 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 26కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 11 ప్రభుత్వ, 22 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. భోగోలు పంచాయతీ పరిధి రాయన్నపాలెం, వేములపల్లి గ్రామాల్లో చేపట్టిన భవన నిర్మాణాలు ఆగిపోవడంతో అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించినట్లు చెప్పారు.


భోగోలులో పెంకుటింట్లో..


మరో చోట అసంపూర్తి నిర్మాణం

తాగునీటి పైపులైన్లకు లీకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎల్-1 లేఅవుట్‌లో తాగునీటి పైపులైన్ల లీకేజీల కారణంగా కాలనీ మొత్తం బురదమయమైంది. వృథాగా పోతున్న నీరు రహదారులు, ఖాళీ స్థలాల్లోకి చేరి మడుగులా మారింది. అంతర్గత రహదారుల్లో వాహనాలు రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు పురపాలక ఇంజినీరింగ్ అధికారులకు చెప్పినా పరిష్కరించలేదని వాపోతున్నారు. ఈ విషయమై కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.



నూజివీడు

• నూజివీడు • కైకలూరు

హుండీ ఆదాయం రూ.4.71 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని నూజివీడులోని కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో బుధవారం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీలను లెక్కించారు. టిక్కెట్ల రూపంలో రూ.1.60 లక్షలు, ఆరు హుండీల్లో రూ.3,11,968 ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి అలివేణి శ్రీ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కల్పించండి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అభ్యసన వైకల్యాలు ఉన్న విద్యార్థులను గుర్తించి అవగాహన కల్పించాలని ఎంఈవో కె.ఆనంద్ కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో బుధవారం విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలపై అవగాహన కల్పించి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు కె.యూన్సీరాణి, బి.రజని, ఫిజియోథెరపిస్ట్ జె.ప్రశాంతి, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో విద్యార్థులు, ఎంఈవో ఆనంద్ కుమార్

సొంతింటి కల నెరవేరేదెలా?

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి శివారు గొల్లగూడెంలోని జగనన్న కాలనీలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలకు పంపిణీ చేసిన స్థలాలు నిరుపయోగంగా మిగిలాయి. ముందుగా 3.70 ఎకరాల్లో 125 మంది లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున స్థలాలు అందించారు. 2022-23లో 39 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. అక్కడ మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించలేదు. దీంతో ఒక్కరు మాత్రమే నానా ఇక్కట్లతో ఇంటినిర్మాణం పూర్తి చేశారు. ఇక్కడ కరెంటు సదుపాయాన్ని కల్పించినా.. నీటి వసతి ప్రతిపాదనలకే పరిమితమైంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక తమ సమస్యలు పరిష్కారమవుతాయని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.



తీర గ్రామాలు.. అధ్వాన దారులు

తాడినాడ (కలిదిండి), న్యూస్‌టుడే : ఉప్పుటేరు తీర గ్రామస్థులను రహదారుల సమస్య పీడిస్తోంది. ఇంట్లో నుంచి కాలు బయటకు పెట్టడానికి వీల్లేకుండా ఏ రోడ్డు చూసినా గుంతలమయంగా మారింది. తాడినాడ నుంచి విభ్రాంపురం మీదుగా చినతాడినాడ వెళ్లే మార్గం ప్రమాదకరంగా తయారైంది. అయిదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక పోవడంతో నానాటికీ గుంతలు పెరిగి పెద్దవవుతున్నాయి. పల్లె పండగ కార్యక్రమంలో రోడ్ల నిర్మాణానికి నిధులు ఇస్తుండటంతో తీర ప్రాంతాల వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉప్పుటేరు తీరంలో అధ్వానంగా ఉన్న రోడ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.



గుంతలమయంగా తాడినాడ - విభ్రాంపురం రోడ్డు

నీడ కరవై.. చెట్టే ఆదరువై..



పోతనపల్లి అడ్డరోడ్డులో చెట్టు నీడలో ప్రయాణికులు

చాట్రాయి, న్యూస్‌టుడే: విస్సన్నపేట-వెలగలపల్లి రోడ్డులో పోతనపల్లి అడ్డరోడ్డు వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అక్కడే ఉన్న చెట్టు నీడలో వాహనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. వర్షం వచ్చినపుడు తడిసి పోతున్నారు. పోతనపల్లికి చెందిన ప్రజలు బస్సు ప్రయాణం చేయాలంటే నాలుగు కి.మీ. వచ్చి ఇక్కడ వేచి ఉండాలి. చెట్టు నీడలో దాతలు ఏర్పాటు చేసిన బల్లల వద్ద ఉంటున్నారు. పిల్లలతో ప్రయాణం చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్ నిర్మిస్తామని చాలా మంది నాయకులు హామీలు ఇచ్చినా అమలు కాలేదు. ఇటీవల ఎన్నికల సమయంలో ఇదే సమస్యను అభ్యర్థులకు గ్రామస్థులు వివరించారు. కానీ నేటి వరకు బస్ షెల్టర్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదని వాపోతున్నారు. కనీసం వర్షం నుంచి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కె.శుభశేఖర్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎస్సై కె.శుభశేఖర్ స్పష్టం చేశారు. ఆగిరిపల్లి అంబేడ్కర్ కూడలిలో బుధవారం సాయంత్రం సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్టు, మత్తు పదార్థాల పార్శిళ్లు వచ్చాయని సైబర్ కేటుగాళ్లు నమ్మించి మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రహదారి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని సూచించారు.

వంట పాత్రల చోరీ

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం వంట పాత్రలు చోరీకి గురయ్యాయి. పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు చెందిన మూడు వంట పాత్రలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. వీటిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పాత్రల విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

గ్రామాలను ఆదర్శంగా మార్చుతాం: కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు వేసి ఆదర్శంగా మార్చుతామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మంజూరైన సీసీ రహదారుల నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంతో కలిసి బుధవారం శంకుస్థాపనలు నిర్వహించారు. వైకాపా పాలనలో శిలాఫలకాలు వేసి ప్రజలను ఏమార్చారు తప్ప రోడ్లు వేసిన దాఖలాలు లేవన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు మార్గాలతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ క్రమంలో సీతనపల్లి వాసులు తాగు నీటికి అవస్థలు పడుతున్నామని ఆర్వో ప్లాంటు నిర్మాణంతో పాటు చెరువు విస్తీర్ణం పెంచాలని కోరడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు బి.నరసింహారావు, పి.గ్రాసారావు, పి.రామచంద్రరావు పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

అవసరం మేరకే సమావేశాలకు హాజరు.. ‘గత వైకాపా ప్రభుత్వం మాదిరిగా ఎమ్మెల్యే గ్రామానికి వస్తుంటే అన్ని శాఖల అధికారులు హాజరవ్వాల్సిందేనని విధానానికి స్వస్తి పలికాం.’ అని ఎమ్మెల్యే శ్రీనివాస్ ఉద్యోగులకు సూచించారు. గ్రామానికి ఏ శాఖ పనిపై వచ్చామో వారు అందుబాటులో ఉంటే చాలు, ప్రజలకు సత్వర సేవలు అందించాలి తప్ప సమావేశాలకు జన సమీకరణ అవసరం లేదన్నారు. శాఖాపరమైన పనులు ఉంటే తప్ప ప్రతి సమావేశానికి హాజరు కావాల్సిన అవసరం లేదనడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

పల్లెకు నూతన శోభ.. మండవల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ రాకతో పల్లె గ్రామాలు నూతన శోభను సంతరించుకున్నాయని కూటమి నేత చావలా దుర్గాప్రసాద్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండవల్లిలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎన్డీయే నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ నిర్వహించారు.

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

చాట్రాయి, న్యూస్‌టుడే: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా జిల్లా పాల సమితి పని చేస్తుందని ఆ సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. చిత్తపూరు కమ్మవారి, తుమ్మగూడెం సంఘాలను ఆయన బుధవారం సందర్శించారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి పాడి పరిశ్రమలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వారికి వివరించారు. ఆయన మాట్లాడుతూ సమీకృత పశు దాణా, మినరల్ మిక్చర్ వాడకం వల్ల పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. జిల్లా డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మేనేజర్ సాంబశివమూర్తి, సంఘాధ్యక్షుడు పొన్నగంటి శ్రీనివాసరావు, మండలపు పద్మావతి, సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు



పాడి రైతులతో మాట్లాడుతున్న కృష్ణా పాల సమితి ఛైర్మన్ ఆంజనేయులు

రైతులు పాల్గొన్నారు.★ పోలవరంలో పాల సేకరణ సంఘం సభ్యుడు యర్రా రంగారావు కుమారుడు సూర్యప్రకాశ్ వివాహాన్ని పురస్కరించుకుని బుధవారం రూ.20 వేలు విలువ చేసే బంగారు నాణెం అందించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ధాత్రిరెడ్డి

రేషన్ పంపిణీ తీరుపై జేసీ ఆగ్రహం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం దాకరంలో రేషన్ పంపిణీపై జేసీ ధాత్రిరెడ్డి పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిల్వలను, రికార్డులను ఆమె పరిశీలించారు. దాకరం దుకాణంలోనే పేరూరు సరకు ఉండటం, ఉండాల్సిన దాని కంటే అధిక నిల్వలు ఉండటం, పంపిణీ అంతంత మాత్రమే జరగడాన్ని గుర్తించిన ఆమె దుకాణదారు, ఎండీయూ ఆపరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అవకతవకలు పరిశీలించి డీలరు, ఎండీయూ ఆపరేటర్‌పై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి సత్యనారాయణరాజును ఆదేశించారు. అనంతరం పెదపాలపర్రులోని పెట్రోలు బంక్ ఏర్పాటు స్థలాన్ని ఆమె తనిఖీ చేశారు. తహసీల్దారు జె.సుభానీ, ఆర్.ఐ. శ్యామ్యూల్, సర్వేయర్ రాజశేఖర్, వీఆర్వో సంజీవ రావు పాల్గొన్నారు.

‘మద్యం కేంద్రంగా పుణ్య క్షేత్రం’

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: మహా పుణ్య క్షేత్రంగా ఖ్యాతి పొందిన తిరుమల తిరుపతిని మద్యం కేంద్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్‌కుమార్ దుయ్యబట్టారు. బుధవారం నూజివీడులో ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మం అని విస్తృత ప్రచారం చేస్తూ గొప్ప దీక్ష చేపట్టిన పవన్‌కల్యాణ్ మద్యం ప్రవాహంపై ఏ సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551	కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268	కలిదిండి: 90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: రామవరం ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామస్థులు చీకట్లో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఎస్సీ కాలనీలోనూ ఇదే పరిస్థితి. **- దయాకర్, రామవరం**

సమాధానం: వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- వి.కొండలరావు, ఈవోపీఆర్డీ, కైకలూరు**

రహదారికి మరమ్మతులు... తీరిన నరకయాతన!.. **ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** నూజివీడు-గన్నవరం విమానాశ్రయానికి వెళ్లే ప్రధాన రహదారి ధ్వంసమై గత ఐదేళ్లు ప్రజలు నరక యాతన అనుభవించారు. ప్రమాదవశాత్తు రహదారి గుంతల్లో పడి గాయాల పాలైనవారు ఉన్నారు. ఈ సమస్యపై పలుమార్లు ‘ఈనాడు’లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన అధికారులు రూ.70 లక్షల నిధులతో ఆగిరిపల్లి-తోటపల్లి రహదారికి మరమ్మతులు ప్రారంభించారు.

లంక గ్రామాల అభివృద్ధి కూటమికే సాధ్యం

మట్టగుంట(కలిదిండి), న్యూస్‌టుడే : లంక గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మట్టగుంటలో రూ.15.44 లక్షలతో మూడు అంతర్గత రోడ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కూటమి నేతలు నాగిడి వీరబ్రహ్మం, అంద్రాజు దుర్గారావు, తిరుమాని పాండురంగారావు, ఒడుగు గణపతి తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న శ్రీనివాసరావు

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

చాట్రాయి, న్యూస్‌టుడే: చీడ పీడల నివారణలో విచ్చలవిడిగా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని, తద్వారా పెట్టుబడులు ఆదా చేయవచ్చని వ్యవసాయాధికారి బండారు శివ శంకర్ తెలిపారు. పోలవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో కలిసి వరి పైరు క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. కాంప్లెక్స్ ఎరువులను తగ్గించి సూటి ఎరువులను తగు మోతాదులో వాడాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని తెలిపారు. బిందు, తుంపర సేద్యం, మార్ఫింగ్, పందిళ్లకు అందించే రాయితీలను ఆయన వివరించారు. తెదేపా నాయకులు మరిడి వెంకటేశ్వరరావు, చెన్నారావు రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శివశంకర్

పంటలకు మిత్ర పురుగులతో ప్రయోజనం.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: అన్నదాతలు తాము సాగు చేసిన పంటల్లో మిత్ర పురుగులను గుర్తించి సంరక్షించుకోవాలని రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకురాలు లలితా సుధ అన్నారు. గురజ, పెనుమల్లిలో బుధవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రైతులు విధిగా మట్టి నమూనాలను పరీక్షించుకుని సిఫారసు చేసిన ఎరువులను మాత్రమే వాడాలని సూచించారు. మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి మాట్లాడుతూ ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. పశువైద్యాధికారి క్రాంతి కుమార్, ప్రకృతి వ్యవసాయ సహాయకుడు గౌతమ్ పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటిస్తే మేలు.. ముసునూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలను పాటించడం ద్వారా రైతులు సాగు వ్యయం తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. బుధవారం ముసునూరు మండలం రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో గ్రామసభలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు.

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేట పంచాయతీకి సంబంధించిన భూమిని కొంతమంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని వాటిని తొలగించాలని కూటమి నాయకులు రంగు శ్రీనివాసరావు, పాశం నాగబాబు, ఉప్పే శివరామకృష్ణ ఆముదాల ఇస్సాకు, స్థానికులు బుధవారం ముసునూరు ఎంపీడీవో జి.రాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ గ్రామంలో కొంతకాలం నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయని వాటిని తొలగించాలని జిల్లా, మండల స్థాయి అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆక్రమణలు జరిగిన ప్రదేశాలను పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికిముందు కార్యదర్శి నాగబాబు సంఘటనా స్థలానికి వెళ్లి ఆక్రమణలు అడ్డుకుని నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.



ఎంపీడీవోకు విన్నవిస్తున్న స్థానికులు

రహదారులు ఆక్రమిస్తే చర్యలు

మండవల్లి, న్యూస్‌టుడే: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ప్రధాన రహదారులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మండవల్లి గ్రామ సర్పంచి మెండా ఝాన్సీ అన్నారు. బుధవారం మండవల్లి జాతీయ రహదారి కాలువ వెంబడి ఆక్రమణలను పోలీసు సిబ్బందితో కలిసి తొలగించి పరదాలు కట్టించారు. రోడ్డు మార్గాలను సొంత స్థలాల్లా వినియోగించుకుని భారీ దుకాణాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీంతో రోడ్డు మార్గాలు రోజురోజుకు కుచించుకుపోయి ప్రమాదాలకు కారణమవుతున్నట్లు సర్పంచి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కొండలు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల గైర్హాజరుపై ఎంపీపీ అసహనం

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రతి మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోతే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎలా చర్చించేదంటూ ఎంపీపీ కొండా దుర్గా భవానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ముసునూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కొండా దుర్గాభవానీ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడంతో 3 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ముసునూరు, రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత ప్రభుత్వ హయాంలో నిలిచిన నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయని త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. నూజివీడు నుంచి రమణక్కపేట - చింతలపూడి మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సును ఏర్పాటు చేయాలని 3 నెలలు క్రితం తీర్మానం చేసి పంపిస్తే ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ పాటించడం లేదని, జరిగే కార్యక్రమాలకు కనీసం ఎందుకు సమాచారం కూడా ఇవ్వడం లేదని అధికారులను నిలదీశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎంపీడీవో జి.రాణి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో అధికారులకు, నాయకులకు సమాచారం ఇవ్వాలని చెబుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాజనాయన, రాపర్ల కృష్ణకుమారి, ఏవో సాయిరాం, ఈవోపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాభవానీ

మధ్యాహ్న భోజనం మెనూ తప్పక పాటించాలి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనంలో మెనూ, నాణ్యత తప్పక పాటించాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ షరీఫ్ సూచించారు. పెదపాలపర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పప్పు పలచగా ఉందని, అలా కాకుండా నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ఇచ్చిన గిన్నెలు మందంగా ఉండటంతో అడుగంటుతున్నాయని నిర్వాహకులు ఆయనకు తెలిపారు. వంట ఏజెన్సీ నిర్వాహకులే అలా అడుగంటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్.ఎం. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న షరీఫ్

‘ఆహార దినాన్ని ఆకలి రోజుగా పాటించాలి’

నూజివీడు పట్టణం న్యూస్‌టుడే: ప్రపంచ ఆహార దినాన్ని ప్రపంచ ఆకలి రోజుగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల సంఘం నూజివీడు మండల సమన్వయకర్త బి.రంగా కోరారు. బుధవారం నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెంలో ఉపాధి హామీ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జయంతి నుంచి 16వ తేదీ వరకు ప్రపంచ ఆహార పక్షోత్సవాన్ని పాటించాలని కేంద్రాన్ని కోరారు. నిరుపేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. పనులు లేని సమయంలో ఉపాధి కార్మికులకు నగదు సాయం చేయాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు

దుకాణాల వద్ద బారులు తీరిన మద్యం ప్రియులు

కైకలూరు, న్యూస్‌టుడే: లాటరీ విధానం పూర్తయి నూతన మద్యం దుకాణాలు ప్రారంభం కావడంతో మద్యం కొనుగోలు చేసేందుకు బుధవారం సాయంత్రం నుంచి మందుబాబులు దుకాణాల వద్ద బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు చేస్తూ పేరుగాంచిన కంపెనీల నాణ్యమైన మద్యం తక్కువ ధరలకే అమ్మకాలు సాగిస్తామని చెప్పడంతో వందల సంఖ్యలో మద్యం ప్రియులు తరలివచ్చారు. దీంతో మండల వ్యాప్తంగా దుకాణాల వద్ద జాతర వాతావరణం సంతరించుకుంది. ఈ క్రమంలో కొత్త ధరలు అమల్లోకి రాకపోవడం దుకాణాల్లో ఉన్న పాత సరకు విక్రయాలు చేయడం.. అది కూడా పాత ధరలకే లభ్యం కావడంతో మందుబాబులు అసహనం వ్యక్తం చేస్తూ పాత బ్రాండ్లనే కొనుగోలు చేసి ఉసూరుమంటూ వెనుదిరిగారు.

స్వచ్ఛత... ఆచరణలో ఏదీ?

ముసునూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ అంటూ దేశ ప్రధాని మొదలు.. గ్రామస్థాయి వరకు వివిధ కార్యక్రమాలు, సభలు, సదస్సులు నిర్వహిస్తూ ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నారు. ముసునూరు మండల పరిషత్తు అధికారులు గ్రామాలకు వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. కానీ తమ సొంత కార్యాలయంలోని అపరిశుభ్రతను మరిచారు. స్వచ్ఛతా హీ సేవా పేరుతో కార్యక్రమాలు చేపట్టే అధికారులకు తమ కార్యాలయ పరిశుభ్రతను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. నిత్యం పనులు కోసం మండల పరిషత్తు కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్ అంటూ ఊదర గొట్టే అధికారులు, ప్రజాప్రతినిధులకు మండల కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలన్న విషయం పట్టదా అని ప్రశ్నిస్తున్నారు.



మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో పెరిగిన చెట్లు

మరోసారి పెదపాలపర్రు మాజీ హెచ్‌ఎంపై విచారణ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెదపాలపర్రు మాజీ హెచ్‌ఎం జె.శాంతకుమారిపై మరోసారి అధికారులు విచారణ నిర్వహించారు. ఇప్పటికే నాలుగు సార్లు విచారణ నిర్వహించిన అధికారులు మరోసారి మంగళవారం పాఠశాలలో విచారణ నిర్వహించి ఆమె నుంచి వివరాలు సేకరించారు. విచారణాధికారి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ అవధాని, ఏడీ-1 షరీఫ్‌లు శాంతకుమారి నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన విచారణలో శాంతకుమారి అనారోగ్య సమస్యతో మధ్యలోనే వెళ్లిపోయారని, అందుకే మళ్లీ ఆమెనే విచారించి వివరాలు సేకరించామన్నారు. ‘నాడు-నేడు’ అవకతవకలపై డీవైఈవోను విచారణాధికారిగా నియమించారని, త్వరలో వాటిని పరిశీలిస్తారని వివరించారు. ‘నాడు-నేడు’ పనుల సామగ్రి లెక్క అప్పజెప్పించాలని, దీనివల్ల పనులు నిలిచిపోయి ఇబ్బందిగా ఉందని హెచ్.ఎం. పాండురంగారావు వారికి లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందించారు.

పెద చెరువుకు గండి నివారణ పనులు

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి పెద చెరువుకు గండి ప్రమాదం తృటిలో తప్పింది.. ఇటీవల భారీ వర్షాల సమయంలో చెరువు కట్టకు బొంగ పడి వృథాగా నీరు పోయింది. ఇక్కడ దట్టంగా చెట్టు పెరగడంతో ఆయకట్టు రైతులు సైతం గమనించలేదు. తూములు తీయకుండానే వర్షాలపై ఆధారపడి వరి సాగు చేస్తుండగా చెరువులో నీటి మట్టం రెండు అడుగుల మేరకు తగ్గిపోవడంతో రైతులు గమనించగా బొంగ కన్పించింది. ఆయకట్టు రైతు, తెదేపా గ్రామ అధ్యక్షుడు గడ్డం ప్రభాకరరెడ్డి సొంత నిధులతో యంత్రాన్ని తీసుకు వచ్చి కన్నాన్ని గడ్డితో మూసేసి మళ్లీ పునరావృతం కాకుండా పనులు చేశారు. రైతులు గమనించకపోతే చెరువుకు గండి పడేది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు చేయగా తర్వాత వైకాపా పాలనలో నిధులు మంజూరు కాకపోవడంతో కట్ట బలహీనంగా మారింది. చాట్రాయి పెద చెరువు ఆయకట్టు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఉంది. సాగర్ జలాలు సైతం వేంపాడు మేజర్ కాలువ ద్వారా చెరువుకు చేరతాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులో పుష్కలంగా నీరుంది. వరి కోతలు అనంతరం రబీ పంటల సాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. రబీలో వరి, మొక్కజొన్న సాగు చేస్తారు. చెరువులో సాగు నీరు తగ్గినా సాగర్ జలాలు వస్తాయనే నమ్మకంతో ఆయకట్టు రైతులున్నారు. రబీ సీజన్‌లో చెరువు కట్టకు పనులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న తెదేపా నాయకుడు ప్రభాకరరెడ్డి

ఎంపీడీవో కార్యాలయ ఏవోగా ఛాయాకుమారి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారిగా డి.ఛాయాకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వీరులపాడు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన కూచిపూడి సాయిరాం ఎ.కొండూరు మండలానికి బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు ఎంపీడీవో జి.రాణి అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రెవెన్యూ గ్రామ సభలు ఇలా..

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి మండలంలో భూముల రీ సర్వే గ్రామసభలను ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు దాసరి ప్రశాంతి తెలిపారు. 18న పర్వతాపురం, 19న పోతనపల్లి, 22న బూరుగుగూడెం, 23న కొత్తగూడెం, 24న చిత్తపూరులో నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఏర్పడిన సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నెల 18న మల్లేశ్వరం, 19న వడ్లమాను, 22న అనంతసాగరం, 23న ఈదులగూడెం, 24న కలటూరు, 25న చొప్పరమెట్ల, 26న పిన్నమరెడ్డిపల్లి, 29న గరికపాటి వారి కండ్రిక, 30న పోతవరప్పాడు, నవంబర్ 1న కనసానపల్లి, 2న సగ్గూరు గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. రైతులు భూ హక్కు పత్రాలతో హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, రైతులు ఈ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోరారు.

కొండ చిలువ హతం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి కొండ చిలువ రావడంతో కలకలం రేగింది. స్వామివారి ఆలయానికి వెళ్లే మెట్ల దగ్గర సుమారు 6 అడుగుల పొడవు ఉన్న కొండ చిలువను స్థానికులు గమనించారు. దాంతో వారు గొడ్డలి, కర్రలతో కొట్టి చంపేశారు. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	మార్టిన్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వేట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వేట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	విశ్వం
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర